# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- కేంద్ర బడ్జెట్ సమావేశాలు ఈ నెల 22వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.
- రాష్ట్రంలో ఈ నెల 8వ తేది నుండి ఉచిత ఇసుక సరఫరా కార్యక్రమాన్ని అమలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.
- రాష్ట్రంలో యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.
- విద్య, వైద్య రంగాల అభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు.
- ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో పలు జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర బడ్జెట్ సమావేశాలు ఈ నెల 22వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా ఈ రోజు వెల్లడించారు. కేంద్రంలో జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తరువాత జరుగుతున్న తొలి బడ్జెట్ సమావేశాలుగా ఆయన పేర్కొన్నారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ని ఈ నెల 23న ప్రవేశపెట్టనున్నారు. ఈ నెల 22 నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని కేంద్ర మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర విభజన సమస్యల మీద చర్చించేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, ఎ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని ప్రజా భవన్ లో కొద్దిసేపటి క్రితం సమావేశం అయ్యారు. రాష్ట్ర విభజన సమయం నుంచి రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలు, అపరిష్కృతంగా ఉన్న అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరగనుందని అధికార వర్గాలు తెలిపాయి. విభజన చట్టంలోని షెడ్యూలు 9, 10 ప్రకారం సంస్థల అస్తుల పంపకాలపై ప్రధానంగా చర్చ జరగనుందని పేర్కొన్నారు. అలాగే, షీలా బీడే కమిటీ సిఫార్సుల మీద కూడా రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చించనున్నారని అధికారులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఈ నెల 8వ తేది నుండి ఉచిత ఇసుక సరఫరా కార్యక్రమాన్ని అమలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ రోజు విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్ లతో దృశ్యమాధ్యమం ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లా కలెక్టరు చైర్మెన్ గా జిల్లా స్థాయి కమీటిలను ఏర్పాటు చేసి ఆన్ లైన్ విధానంలో వినియోగదారులకు మొదట వచ్చిన వారికి మొదట అన్న పద్ధతిలో ఇసుక సరఫరా చేయాలని కోరారు. అదే విధంగా ఉచిత ఇసుక సరఫరా విధానంపై ప్రజల్లో అవగాహన కలిగించాలని అన్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుండి కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కె.వి. మురళీకృష్ణ, తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ స్థాయిలో యువత ఉద్యోగాలు సాధించే విధంగా నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరంలోని టీటిడీసీ శిక్షణా కేంద్రం, జిల్లా సమాఖ్య కార్యకలాపాలను మంత్రి ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... యువతకు నైపుణ్య పరమైన శిక్షణ అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమని అన్నారు. ఈ విషయంలో ప్రైవేటు సంస్థలు ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. కాగా, నైపుణ్యం ఉన్న యువతకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

విద్య, వైద్య రంగాల అభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యపడుతుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు, బూట్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యా, వైద్య రంగాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అత్యంత భాధ్యతగా వ్యవహరిస్తోందని స్పష్టం చేసారు. చదువుతో పాటు క్రీడలు, సాంకేతిక శిక్షణలో తర్ఫీదు ఇవ్వడం ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో పలు జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అదే విధంగా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది. ఆ వివరాలను అమరావతి వాతావరణం కేంద్ర అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

జగన్నాథ రథయాత్ర పర్వదినం సందర్భంగా పూరీకి వెళ్లే యాత్రికుల కోసం వాల్తేర్ రైల్వే డివిజన్ ప్రవేశపెట్టిన విశాఖపట్నం - పూరీ రథ యాత్ర ప్రత్యేక రైలును విశాఖ పార్లమెంటు సభ్యులు ఎమ్. శ్రీభరత్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, పవిత్ర రథయాత్ర ఉత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులకు ఇది మంచి అవకాశమని అన్నారు. ప్రయాణీకుల సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు, వందేభారత్ వంటి హై-స్పీడ్ సేవలను ప్రవేశపెట్టడంలో భారతీయ రైల్వేలు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్, డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీ సౌరభ్ ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంపూర్ణతా అభియాన్ పథకంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు. సంపూర్ణత అభియాన్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ రోజు ఎర్రగొండపాలెం తహసిల్దార్ కార్యాలయం నుంచి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆడిటోరియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వంద అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు పోషణ్ అభియాన్ పై నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. మూడు నెలల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని ఈ సందర్భంగా అధికారులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సభలో వివిధ శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న వివిధ పథకాల కోసం బ్యాంకులు సహకరించాలని విజయనగరం కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోరారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకులు, అధికారులతో కూడిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ తొలి త్రైవార్షిక సమావేశం కలెక్టర్ అధ్యక్షతన ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రాయోజిత పథకాల అమలుకు బ్యాంకర్లు సహకరించాలని అన్నారు. ఇదిలా ఉండగా, విజయనగరంలో టిడ్కో ఇళ్లకు సంబంధించి లబ్దిదారుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని మునిసిపల్ కమిషనర్, మెప్మా పిడిలను కలెక్టర్ ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. అదే విధంగా ఫిర్యాదుల పరిష్కారం కోసం సంబంధిత శాఖ అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని కోరారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాల నివారణ కోసం నిర్దేశించిన టోల్ ఫ్రీ నంబర్లు, ఈ మెయిల్ ఐడీలను కలెక్టర్ తన ఛాంబర్ లో ఈరోజు విడుదల చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపైన ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆషాడ మహోత్సవాలు ఈ రోజు నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది ఆషాడ మాసంలో శ్రీ కనక దుర్గమ్మ వారికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో అమ్మవారికి తొలి సారెను ఆలయ వైదిక కమిటీ సభ్యులు సమర్పించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక సారెను సమర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =